# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 19-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆధునిక అంతరిక్ష సాంకేతికతపై భారత అంతరిక్ష రంగం దృష్టి సారిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- దేశ యువత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- ప్రకృతి విపత్తుల సమయంలో జాతీయ విపత్తు నిర్వహణ దళం అందించే సేవలు ప్రభుత్వ నిబద్ధతకు చిహ్నంగా నిలస్తున్నాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు.
- తొలి ఖో ఖో ప్రపంచ ఛాంపియన్ షిప్ ట్రోఫీని భారత మహిళల జట్టు కైవసం చేసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ అంతరిక్ష రంగాన్ని శాస్త్రవేత్తలు స్వావలంబన దిశగా తీర్చిదిద్దుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఈరోజు ఆకాశవాణి ద్వారా తన మనసులోని భావాలను ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 118వ సంచికలో ఆయన మాట్లాడుతూ... దేశ శాస్త్రవేత్తలు అంతరిక్షంలో ఉపగ్రహాలను అనుసంధానం చేసే రంగంలో మరొక అద్భుత విజయం సాధించారని అన్నారు. ఆధునిక అంతరిక్ష సాంకేతికతపై భారత అంతరిక్ష రంగం దృష్టి సారిస్తోందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

సమున్నత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 26వ తేదీన నిర్వహించుకోబోయే భారత గణతంత్ర 75వ వార్షికోత్సవం చాలా ప్రత్యేకమైందని, ఈ ఏడాదితో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలవుతోందని ప్రధానమంత్రి తెలిపారు. దేశానికి పవిత్రమైన రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని ప్రముఖులు మనకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేశారని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందని తెలిపారు. కుంభమేళాకు పెద్ద సంఖ్యలో వస్తున్న యువతను ఆయన అభినందించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమని ప్రధానమంత్రి తెలిపారు. భారత దేశ పటిష్టమైన ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పడిందని ప్రధానమంత్రి తెలిపారు. దేశ పౌరులందరూ ఎల్లప్పుడూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటూ.. దేశ ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడాలని పిలుపునిచ్చారు. ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిచిన దేశ మహోన్నత నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఈ నెల 23వ తేదీని "పరాక్రమ దివస్"గా జరుపుకొంటున్నామని ప్రధానమంత్రి గుర్తు చేశారు. ప్రజల సంక్షేమం కోసం నేతాజీ చేసిన కృషి ఎప్పటికీ  చిరస్మరణీయమని అన్నారు. ఆయన జీవితం నుంచి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. అలాగే యువత అంకుర సంస్థల వైపు ఆకర్షితులవుతున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దీంతో స్టార్టప్ ఇండియా రూపుదిద్దుకుంటోందని.. దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందన్నారు.  దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. నేటి యువత తమ అభివృద్ధి గురించి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కృషి చేస్తోందని ప్రధాని పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత  ఖో ఖో మహిళల జట్టు తొలి ప్రపంచ ఛాంపియన్ జట్టుగా నిలిచింది. ఈరోజు దిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఖో ఖో ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ లో భారత మహిళల జట్టు నేపాల్‌ను 38 పాయింట్ల తేడాతో ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది. టోర్నమెంట్ తొలి మ్యాచ్ నుంచి ఆధిపత్యంతో ప్రతి మ్యాచ్‌ను గెలుస్తూ వచ్చిన మహిళల జట్టు, ఫైనల్‌లోనూ అదే శైలిని కొనసాగించింది. ఈ క్రమంలో 78 - 40 పాయింట్లతో నేపాల్‌ను ఓడించి తొలి ప్రపంచ కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ విపత్తు నిర్వహణ దళం (ఎన్డీఆర్ఎఫ్) ధైర్యం, అంకితభావం నిస్వార్థ సేవ ఎనలేనిదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ దళం NDRF ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి సామాజిక మధ్యమం వేదికగా వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రాణాలను కాపాడటం, విపత్తులను ఎదుర్కోవడం, అత్యవసర సమయాల్లో భద్రత కల్పించడంలో వారి అచంచలమైన నిబద్ధత అభినందనీయమని అన్నారు. విపత్తు నిర్వహణలో NDRF ప్రపంచ ప్రమాణాలను నెలకొల్పిందని ప్రధాన మంత్రి తెలిపారు.

జాతీయ విపత్తు నిర్వహణ దళం (NDRF) ఆవిర్భావదినోత్సవం సందర్భంగా NDRF సిబ్బందికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ దళం ప్రకృతి వైపరీత్యాలు, ఇతర సమయాల్లో ప్రజల ప్రాణాలను కాపాడుతూ,  పౌరుల భద్రతకు,  ప్రభుత్వ నిబద్ధతకు చిహ్నంగా మారిందని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇతరులను కాపాడేందుకు తమ ప్రాణాలను అర్పించిన అమరవీరులకు ఆయన నివాళులర్పించారు. మరోవైపు కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులో జరిగిన  ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలలో కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా పాల్గొని ప్రసంగించారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

మహా కుంభమేళాకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం శ్రీ మాతా వైష్ణో దేవి రైల్వే స్టేషన్, కత్రా, ప్రయాగ్‌రాజ్ మధ్య మూడు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని ఉత్తర రైల్వే విభాగం ప్రకటించింది. మొదటి రైలు ఈనెల 24వ తేదీన శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా స్టేషన్ నుండి బయలుదేరి 25న ప్రయాగ్‌రాజ్ చేరుకొని అదే రోజు తిరిగి బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. తదుపరి రెండు రైళ్లు ఫిబ్రవరి 7, 14 తేదీలలో కత్రా రైల్వే స్టేషన్ నుండి బయలుదేరి మరుసటి రోజు ప్రయాగ్‌రాజ్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో ఈ రైళ్లు ఫిబ్రవరి 8, 15వ తేదీలలో ప్రయాగ్‌రాజ్ నుండి బయలుదేరి మరుసటి రోజు కత్రా రైల్వే స్టేషన్‌కు చేరుకుంటాయని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం ఈ రోజు ఉదయం 8 గంటల 30 నిమిషాలకు ఇది అమల్లోకి రావాల్సి ఉండగా.. దాదాపు 3 గంటలు ఆలస్యమైంది. హమాస్ నుంచి ఇజ్రాయెలీ బందీల జాబితా విడుదలలో జాప్యం కావడంతో తొలుత శాంతి ఒప్పందం అమలుపై సందిగ్ధత నెలకొన్నప్పటికీ... ముగ్గురు బందీల వివరాలను హమాస్ సామాజిక మాధ్యమం వేదికగా విడుదల చేసింది. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం అమలుకు ఇజ్రాయెల్ అంగీకరించింది. 15 నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి తాత్కాలిక ముగింపు పలుకుతూ.. ఇజ్రాయెల్ - హమాస్‌లు ఇటీవల ఒక అంగీకార ఒప్పందానికి వచ్చాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అండర్ - 19 మహిళల క్రికెట్ టీ-20 ప్రపంచ కప్‌లో కౌలాలంపూర్ వేదికగా వెస్టిండీస్‌తో ఈరోజు జరిగిన తొలి మ్యాచ్ లో భారత జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 13.2 ఓవర్లలో 44 పరుగులకు మొత్తం వికెట్లను కోల్పోయింది. 45 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 4.2 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి సునాయసంగా ఛేదించింది. ఈ టోర్నమెంట్లో భారత్ తదుపరి మ్యాచ్ ఈనెల 21న మలేసియాతో ఆడనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఈరోజు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సెక్టార్ 19లో భక్తులు, సాధువుల కోసం వేసిన గుడారాల్లో రెండు వంట గ్యాస్ సిలిండర్లు ప్రమాదవశాత్తు పేలి మంటలు చెలరేగాయి. దీంతో సుమారు 30 గుడారాలు మంటల్లో దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రమాదస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాగా ఈరోజు 17 లక్షల మంది భక్తులు కుంభమేళాలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =